## క్లుప్తంగా

### ఘనంగా అయ్యప్పస్వామి పడి పూజ


పడి పూజ నిర్వహిస్తున్న మాలధారులు

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో అయ్యప్ప స్వామి పడి పూజ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. అయ్యప్ప మాలాధారులు స్థానిక మారెమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పడి పూజ కార్యక్రమంలో పాల్గొని అయ్యప్పస్వామి భక్తి గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా అరటి మోసులతో ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి ఆలయ రూపంలో దేవుడిని అలంకరించిన విధానం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మాలధారులు పాల్గొన్నారు.

గోరంట్ల: స్థానిక సీటీసీ థియేటర్ సమీపంలోని అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలో మంగళవారం అయ్యప్ప మండల పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలు, హోమాలు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

### వాల్మీకులు సంఘటితం కావాలి


వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

పావగడ: వాల్మీకులు సంఘటితం కావాలని అప్పుడే అభివృద్ధి సాధ్యమని స్థానిక నిడుగల్ వాల్మీకి ఆశ్రమాధిపతి సంజయ కుమార స్వామి తెలిపారు. తాలూకాలోని నిడుగల్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు జ్యోతులు మోశారు.

### జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

హిందూపురం టౌన్: పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎస్ఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లాకు వినతిపత్రం అందించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబావలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వైష్ణవులు అన్ని రంగాల్లో రాణించాలి

పావగడ: తాలూకా వ్యాప్తంగా వైష్ణవులు అన్ని రంగాల్లో రాణించాలని స్థానిక తాలూకా వైష్ణవ మహాసభ అధ్యక్షుడు భీమనకుంటె సంపత్ కామార్ అన్నారు. పట్టణంలోని షిర్డి సాయిబాబా దేవాలయంలో మంగళవారం నూతన క్యాలెండర్ల విడుదల చేశారు. వైష్ణవ సంఘం నాయకులు దర్శన్, శ్రీరామ్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

### గడ్డివామి దగ్ధం

హిందూపురం అర్బన్ (లేపాక్షి): మండల కేంద్రంలోని అంజినప్ప అనే రైతుకు చెందిన గడ్డివాముకు మంగళవారం గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టారు. దీంతో రూ.60 వేలు విలువ చేసే గడ్డివాము దగ్ధమైంది. పశువుల కోసం ఉంచిన పశు గ్రాసం కాలిబూడిదవడంతో రైతు కన్నీరు మున్నీరయ్యారు. దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను బాధితుడు కోరాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించాడు.

### భక్తిశ్రద్ధలతో దత్తాత్రేయ జయంతి


హిందూపురం: దత్తాత్రేయస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని వివిధ ఆలయాల్లో మంగళవారం దత్తాత్రేయ జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ విగ్రహాలు, చిత్రపటాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పావగడలో...


అలంకరణలో దత్తాత్రేయస్వామి

పావగడ: స్థానిక శనీశ్వరాలయంలో దత్తాత్రేయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు మనోహర్ శర్మ దత్తాత్రేయ, గణపతి హోమాలను నిర్వహించారు. బ్రహ్మ, విష్ణు, పరమేశ్వరుల స్వరూపమే దత్తాత్రేయుడని ఆలయ ప్రధాన అర్చకుడు కేవీ కృష్ణశాస్త్రి తెలిపారు.

# సందడిగా ఆడుదాం ఆంధ్రా


పెనుకొండ: టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ


మడకశిర: మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి


హిందూపురం: క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

- హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో క్రీడా పోటీలు ప్రారంభం
- క్రీడా స్ఫూర్తిని చాటాలన్న ఎమ్మెల్యే శంకరనారాయణ
- ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి
- క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించాలన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

పెనుకొండ: గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ వెలికితీయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం 'ఆడుదాం ఆంధ్రా' క్రీడల్లో భాగంగా పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరమన్నారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలు మానసిక ఉల్లాసం, ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. గ్రామీణ క్రీడాకారులకు సరైన అవకాశాలు లేక తమ ప్రతిభను చాటలేకపోతున్నారని, వారి ప్రతిభను గుర్తించాలనే 'ఆడుదాం ఆంధ్రా' నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను చూపించి ప్రపంచానికి ఏపీ గొప్పతనాన్ని చాటాలన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని చాటాలని సూచించారు. అనంతరం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. సమావేశంలో ఎంపీడీఓ శివశంకరప్ప, జెడ్పీటీసీ శ్రీరాములు, పట్టణ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు బోయ నరసింహ, నాగలూరు బాబు, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూఖ్‌ఖాన్, కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, భాస్కర్‌నాయక్, సద్దాం, తయూబ్, నాయకులు నేమతుల్లా, బాబు, మారుతి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ఒక వరమని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలోని కొత్త ఎస్సీ కాలనీ, సాయినగర్ వార్డు సచివాలయం పరిధిలో తొలిరోజు క్రికెట్ పోటీలు జరిగాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే తిప్పేస్వామి బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. అంతకు మునుపు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ కృష్ణానాయక్ బౌలింగ్ చేశారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్నారని తెలిపారు. 47 రోజుల పాటు వివిధ క్రీడా పోటీలను సచివాలయం స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వేదిక ద్వారా నైపుణ్యం కలిగిన క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. యువత, క్రీడాకారులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కమిషనర్ ప్రభాకర్ రావు, ఎంఈఓ భాస్కర్, ప్రిన్సిపాల్ సుజాత, ఎంపీపీ కవిత, సింగల్‌విండో అధ్యక్షులు రామిరెడ్డి, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, మాజీ ఎంపీపీ బజ్జప్ప, జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, కౌన్సిలర్లు అంజన్, నాగేంద్ర, అన్వర్, కోఆప్షన్ సభ్యుడు ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: పట్టణంలోని స్థానిక మున్సిపల్ ఎంజీఎం క్రీడా మైదానంలో మంగళవారం మున్సిపల్ కమిషన్ ప్రమోద్‌కుమార్ అధ్యక్షతన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ రాష్ట్రం మొదటిసారి క్రీడాభివృద్ధికి బాటలు వేయడానికి సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సంబరాలను నిర్వహిస్తున్నారన్నారు. 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలతో విద్యార్థులకు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులని గుర్తించి వారిలో క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తూ రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎదిగేందుకు వేదికగా మార్చాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అనంతరం బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమషనర్ ప్రమోద్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మహేంద్రరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఏ, బీ, బ్లాక్ కన్వీనర్లు సాదిక్, నరేష్,మండల కన్వీనర్ రాము, కౌన్సిలర్లు మలికార్జున, రోషన్, రహమత్‌బీ, మల్లికార్జునగౌడ్, జిల్లా కార్యదర్శి ఇలియాజ్, నాగమణి, ఆర్.కె ఖాలీల్ పాల్గొన్నారు.

**'పురం'లో మారథన్ ర్యాలీ**

ఆంధ్ర ప్రదేశ్‌లో క్రీడాకారుల ప్రతిభను చాటిచెప్పేలా జగనన్న పిలుపుమేరకు ఆడుదాం ఆంధ్ర క్రీడాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించాలని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. ఆడుదా ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని రహమత్ పురం సర్కిల్ నుంచి మారథాన్ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది విద్యార్థినీ విద్యార్థులతో కలిసి ఐదు కిలోమీటర్ల ర్యాలీలో చేపట్టారు.

రొద్దం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచ్ రూప ప్రారంభించారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల్లో కార్యక్రమం ప్రారంభించినట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ నరసయ్య, తహసీల్దార్ అనంతచారి, ఈఓఆర్డీ కేశవరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సర్పంచ్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ఎంపీడీఓ సరస్వతి సమక్షంలో 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను మంగళవారం ప్రారంభించారు. అనంతరం వారికి క్రీడా సామగ్రి అందించారు. కొడిగెనహళ్లిలోని ఏపీఆర్ఎస్ క్రీడా మైదానంలో తహసీల్దారు సౌజన్యలక్ష్మీ, శాసనకోటలో ఎంఈఓ లక్ష్మీదేవి తదితరులు క్రీడలను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ సవిత, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, జెడ్పీటీసీ శ్రీరామప్ప తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: మండలంలోని అమరాపురం, బసవనపల్లి, నిడ్రఘట్ట, వలస, తమ్మడేపల్లి, హల్కూరు గ్రామ సచివాలయ పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. 47 రోజులు జరిగే వివిధ క్రీడ పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ స్వారక్క, వైస్ ఎంపీపీలు కృష్ణమూర్తి, లలితమ్మ, సర్పంచులు వాగేష్, నాగవేణి, భాగ్యమ్మ, గిరిజమ్మ, ఎంపీటీసీలు నరసింహమూర్తి, అనసూయమ్మ, ఎంపీడీఓ మునిస్వామి, ఈఓఆర్డీ నాగముని తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: మండల పరిధిలోని అన్ని సచివాలయాల్లో మంగళవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఎంపీడీఓ రామారావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. వివిధ క్రీడా పోటీల్లో యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం పోటీలను నిర్వహిస్తోందన్నారు.

చిలమత్తూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడానికే సీఎం జగన్ ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీపీ పురుషోత్తమరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మొరసలపల్లి సచివాలయ పరిధిలో 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, ఈఓఆర్డీ ఈశ్వరయ్య, స్థానిక నాయకులు శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం అర్బన్ (లేపాక్షి): లేపాక్షి మండలంలోని చోళసముద్రం పంచాయతీ పరిధిలో సచివాలయ స్థాయి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, ఎంపీడీఓ నరసింహనాయుడు క్రీడా పోటీలను ప్రారంభించారు.

రొళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, ఎంపీపీ కవిత, రత్నగిరి జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఎంఈఓ శ్రీధర్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా పోటీలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 3వ తేదీ వరకూ కొనసాగుతాయన్నారు.

గోరంట్ల: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి విజయకుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడానికే ఈ పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. అనంతరం వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో క్రీడా పోటీలను పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రమీల, సర్పంచ్ సరోజబాయి, ఎంపీడీఓ రఘునాథ గుప్త, యంఈఓ గోపాల్ పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని మావటూరు, గుట్టూరు గ్రామాల్లో మంగళవారం ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభించారు. గ్రామీణ స్థాయి క్రీడా కారుల ప్రతిభ వెలికితీసేందుకే ప్రభుత్వం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

అగళి: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రేణుక, ప్రత్యేక ఆధికారి చంద్రశేఖర్, మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ తెలిపారు. అగళి, మధుడి, పి బ్యాడిగేరె గ్రామ సచివాలయల పరిధిలోని ఆవరణలో ఆడదాం ఆంధ్రా క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభించారు.


గోరంట్ల: పులేరులో వాలీబాల్ పోటీలో పాల్గొన్న యువకులు


పెనుకొండ మండలం మావటూరులో బ్యాడ్మింటన్ ఆడుతున్న యువతులు


రొద్దం: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న హౌసింగ్ పీడీ నరసయ్య


పరిగి: ఏపీఆర్ఎస్‌లో బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ


చిలమత్తూరులో పోటీలు ప్రారంభిస్తున్న నాయకులు


రొళ్ల: పోటీలను బ్యాటింగ్ చేసి ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అనంతరాజు


గుడిబండ: క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీపీ రాధమ్మ


లేపాక్షిలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు


అమరాపురం: క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

## గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

సోమందేపల్లి: క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. మండల కేంద్రమైన సోమందేపల్లిలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం బ్యాటింగ్ చేసి సబ్ కలెక్టర్ పోటీలను ప్రారంభించారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఉన్న క్రీడాకారులను ప్రతిభ వెలుగులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. అదే విధంగా క్రీడల్లో గెలుపు ఓటమిని సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ వెంకటరత్నం, ఎంపీపీ గంగమ్మ జెడ్పీటీసీ అశోక్, సర్పంచ్ గంగాదేవి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఈఓఆర్డీ నాగరాజు రావు, హెచ్ఎం ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.


సోమందేపల్లి: క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

**మానవత చాటుకున్న సబ్‌కలెక్టర్**

క్రీడల్లో పాల్గొనడానికి వచ్చిన గౌతమ్ అనే క్రీడాకారుడు మైదానంలో సొమ్మసిల్లి పడిపోయాడు. అక్కడే ఉన్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ తన వాహనంలో అతన్ని తహసీల్దార్ సురేష్‌కుమార్‌ను వెంట పంపారు. అనంతరం సబ్‌కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులకు సూచించారు.

## ప్రజా సంక్షేమానికి పెద్దపీట

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

చిలమత్తూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమానికే పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక అన్నారు. మంగళవారం మండలంలోని దేమకేతేపల్లి పంచాయతీలోని గాద్రాళ్లపల్లి, కొర్లకుంట గ్రామాల్లో దీపిక ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం దీపిక మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. టీడీపీ అబద్ధపు హామీలిచ్చి మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తోందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించాలనే నిరంతరం ప్రజల మధ్య ఉంటున్నామని తెలిపారు. సమస్యలు లేవని ప్రజలు చెప్పే వరకూ ప్రజల ముందుకు వస్తూనే ఉంటామని చెప్పారు. గ్రామంలో సీసీ రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు తెలిపారు. త్వరలోనే రోడ్డు వేయిస్తామని దీపిక హామీ ఇచ్చారు. ప్రజలను ఇలా పిలిచి మరీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన వారే లేరని , తొలిసారి చూస్తున్నామంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, ఎస్ఐ గంగాధర్, సర్పంచ్ తిరుమలేష్, స్థానిక నాయకులు లక్ష్మిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ శంకర్‌రెడ్డి, షాకీర్, నయిముల్లా తదితరులు పాల్గొన్నారు.


గాద్రాళ్లపల్లిలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

### వైభవంగా లక్షదీపోత్సవం

అమరాపురం: మండల పరిధిలోని హేమవతి గ్రామంలో సిద్దేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అర్చకులు వివిధ పూజలు చేశారు. ఆలయ ఆవరణలో భక్తులు దీపాలు వెలగించి మొక్కులు చెల్లించుకున్నారు.


ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

### భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో పాల్గొంటున్న భక్తులు ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి అధికారులు, రథోత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. మంగళవారం జిల్లెడుగుంటలో జరిగిన ఆంజినేయస్వామి బ్రహ్మరథోత్సవంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి పాల్గొన్నారు. బుధవారం జరిగే భూతప్ప ఉత్సవాలు, జ్యోతుల ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొంటున్నారని లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

### 17న చేనేత కార్మిక సంఘం జిల్లా సభలు

సోమందేపల్లి: చేనేత కార్మిక సంఘం జిల్లా మహాసభలు జనవరి 17న మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు చేనేత కార్మిక సంఘం మండల గౌరవాధ్యక్షుడు బాలస్వామి తెలిపారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద మహాసభల పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. పెద్ద ఎత్తున చేనేత కార్మికులు తరలి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం మండల నాయకులు బందారు ఆంజినేయులు, అశోక్, అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

### ఐఈఏకు శివశంకరమూర్తి ఎంపిక

పరిగి: మండలంలోని ఊటుకూరుకు చెందిన కేసీ శివశంకరమూర్తి ఈనెల 27 నుంచి 29 తేదీ వరకూ ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగే ఇండియన్ ఎకనామిక్స్ అసోసియేషన్ (ఐఈఏ) సమావేశానికి ఎంపికయ్యారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ విభాగంలో ప్రొఫెసర్ దేవరాజులు వద్ద పీహెచ్‌డీ చేస్తున్నట్లు తెలిపారు. దేశ విదేశాల నుంచి హాజరయ్యే ప్రొఫెసర్లు, ఎకనామిక్స్ నిపుణులతో పాటూ పాల్గొనే అవకాశం కలిగినందుకు సంతోషంగా ఉందన్నారు.

### ఉచిత మెగా వైద్య శిబిరం

హిందూపురం అర్బన్: హిందూపురం మండల పరిదిలోని తూముకుంట చెక్‌పోస్ట్ ఏపీఐఐసీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డబ్ల్యూహెచ్ఓ ట్రస్ట్, కిమ్స్ సవీరా ఆస్పత్రి, పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్య బృందం సంయుక్తంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తూముకుంట, గుడ్డంపల్లి, గొళ్లాపురం ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

### ఓటింగ్ విధానంపై అవగాహన

హిందూపురం టౌన్: ఈవీఎంలలో ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై ప్రజలకు డెమో ద్వారా ఎన్నికల అధికారులు అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక పట్టుగూళ్ల మార్కెట్, ఆర్టీసీ కాలనీ, రహమత్‌పూరం, శాంతినగర్ ప్రాంతాల్లో ఎన్నికల నోడల్ అధికారి సెరికల్చర్ ఏడీ సురేష్ ఈవీఎంల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్ర ప్రచార రథాన్ని ప్రారంభించి రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.

### భక్తులకు అన్నదానం

పెనుకొండ: బాబయ్య దర్గా గంధం, ఉరుసు ఉత్సవాల్లో భాగంగా దర్గాకు వచ్చిన భక్తులకు దర్గా మొదటి పీఠాధిపతి సజ్జద్‌బాబా మంగళవారం అన్నదానం చేశారు. దర్గా సమీపంలోని సజ్జద్‌బాబా ఇంటి వద్ద భక్తులకు డీఎస్పీ హుస్సేన్ చేతుల మీదుగా అన్నదానం చేశారు.